క్లుప్తంగా

ఇళ్ల మధ్యనే మురుగు



మల్దకల్: మండలంలోని అమరవాయిలో ఇళ్ల మధ్యనే వర్షపునీటితో పాటు మురుగు నిలవడంతో కాలనీవాసులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ పొలాలకు వెళ్లే రైతులు ప్రతి రోజు మురుగులో వెళ్లాల్సిన పరిస్థితి దాపురించిందని వాపోతున్నారు. మురుగులో దోమల వ్యాప్తి పెరిగి కాలనీలో చిన్నారులు జ్వరాల బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సర్పంచ్‌ల పాలన ముగిసి ప్రత్యేక అధికారులను కేటాయించినా వారు గ్రామం వైపు కన్నెత్తి చూడటం లేదని కాలనీవాసులు మండిపడుతున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

స్వర్ణోత్సవసభను విజయవంతం చేయండి



అయిజ: పీడీఎస్‌యూ 50 వసంతాల సభను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హరీష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో స్వర్ణోత్సవ సభకు సంబంధించిన గోడ పత్రికను విడుదల చేశారు. ఈసందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో సెప్టెంబర్ 30న ఉస్మానియా యూనివర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించే సభకు విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు చందు, అరుణ్, జమున్న, సాగర్, రమ్య, రాణి తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ బలోపేతానికి కృషి



మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాల్లో బీఎస్పీ అభివృద్ధికి కార్యకర్తలు, నాయకులు తమవంతుగా కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు సూచించారు. బుధవారం మల్దకల్‌లో కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో రాజు, గోవింద్, మణికుమార్, వెంకటేష్, నరేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల అందజేత



మానవపాడు: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయిలో ఖోఖోలో మొదటి బహుమతిని సాధించారని ఎంఈఓ శివప్రసాద్ తెలిపారు. బుధవారం విజేతలకు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయన్నారు.

స్వచ్ఛందంగా రోడ్డుకు మరమ్మతు



అయిజ: మండలంలోని దేవబండ గ్రామ సమీపంలో బుధవారం గ్రామస్తులు సొంత ఖర్చులతో రోడ్డుకు తాత్కాలికంగా మరమ్మతులు చేయించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అయిజ నుంచి దేవబండకు వెళ్లే రోడ్డు కొట్టుకపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. విద్యార్థులు మండల కేంద్రంలోని పాఠశాల, కళాశాలలకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. రైతులు పంట పొలాలకు వెళ్లడానికి సైతం ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై అధికారులు స్పందించకపోవడంతో గ్రామస్తులు విరాళాలు సేకరించి తాత్కాలికంగా రోడ్డుకు మరమ్మతు పనులు చేయించారు.

స్వచ్ఛ పట్టణ సాధనకు కృషి



సంగాల చెరువు వద్ద మొక్కలు నాటుతున్న మున్సిపల్ కమిషనర్ దశరథం



వడ్డేపల్లిలో..



అయిజలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

గద్వాల అర్బన్: గద్వాలను స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దుదామని, అందుకు ప్రజలందరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ దశరథం అన్నారు. బుధవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా పట్టణ శివారులోని సంగాల చెర్వు వద్ద ఆయన మొక్కలను నాటారు. అదేవిధంగా దౌదర్‌పల్లిలో సిబ్బందితో జీవీపీ పాయింట్‌ను శుభ్రం చేయించడంతో పాటు కలెక్టరేట్ కార్యాలయం వద్ద మొక్కలు, వివిధ వార్డుల్లో చెత్తను సేకరించి శుభ్రం చేశారు.

విద్యార్థుల ర్యాలీ

అయిజ: మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ లక్ష్మారెడ్డి సూచన మేరకు మండల కేంద్రంలోని అక్షర పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులతో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. అదేవిధంగా ప్రధాన రోడ్లపై బ్యానర్ పట్టుకొని విద్యార్థులు ర్యాలీ తీశారు. పట్టణాలు, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నివాస గృహాలతో పాటు చుట్టు పక్కల పరిసర ప్రాంతాలను ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా చూసుకునేలా కృషిచేయాలని నినాదాలు చేస్తూ విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు.

మొక్కలు సంరక్షించాలి

శాంతినగర్: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా వడ్డేపల్లి మాధవస్వామి గుట్టపై మున్సిపల్ సిబ్బంది బుధవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయ సిబ్బంది ప్రభాకర్, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

కేటీదొడ్డి: గట్టు ఎత్తిపోతల పథకం ద్వారా కర్ణాటకకు నీటిని తరలిస్తే నడిగడ్డకు తీవ్ర నష్టం జరుగుతుందని జోగుళాంబ గద్వాల జిల్లా బీఆర్‌ఎస్ నాయకులు బాసుహన్మంతు నాయుడు, కుర్వ పల్లయ్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని మల్లాపురం శివారులోని సోమనాద్రి గట్టు ఎత్తిపోతల రిజర్వాయర్ పనుల పరిశీలనకు రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి కి రైతుల తరఫున వినతిపత్రం ఇచ్చేందుకు వస్తున్న బీఆర్‌ఎస్ నాయకులను కేటీదొడ్డి పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో పేరుకే ప్రజాపాలన, ఆచరణలో మాత్రం నిర్బంధాలతో భయపెడుతున్నారని ధ్వజమెత్తారు. గట్టు ఎత్తిపోతల పథకం ద్వారా కర్ణాటకకు నీటిని తరలిస్తే గట్టు మండలాన్ని ఖాళీ చేయాల్సిన దుస్థితి వస్తుందని, స్థానిక రైతులు మొత్తం భూమిని కోల్పోవాల్సి వస్తుందని వాపోయారు. కార్యక్రమంలో శేఖర్ నాయుడు, మోనేష్, సామేలు, తిరుమలేష్, రాము నాయుడు, రాజు నాయుడు, వెంకటేష్, ముని, బాసు గోపాల్, వీరేష్, రవి, తదితరులు ఉన్నారు.

డ్యాన్స్‌లో కేజీబీవీ విద్యార్థుల ప్రతిభ



ఉండవెల్లి: మండలంలోని కస్తూర్బా పాఠశాలకు చెందిన విద్యార్థులు ఈ నెల 24న బాలభవన్‌లో నిర్వహించిన జానపద నృత్యాలు, ఫోక్ డ్యాన్స్‌లో ద్వితీయ బహుమతికి ఎంపికైనట్లు పీఈటీ అరుణతార తెలిపారు. వారిని బుధవారం జీసీఈఓ ఫర్జానా అభినందించారు.

కబడ్డీలో రాష్ట్ర స్థాయికి..

మండలంలోని కలుగోట్ల కస్తూర్బా పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు అండర్–17, 14 కబడ్డీ పోటీలో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు బుధవారం పీఈటీ అరుణతార ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–17లో 9 వ తరగతికి చెందిన నందిని, అండర్–14లో 8వ తరగతికి చెందిన భానుప్రియ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికవడంతో జీసీఈఓ ఫర్జాన, ఎంఈఓ రామకృష్ణ, ఎస్‌ఓ పరిమళ, విద్యార్థులను అభినందిచారు.

చదువుతోనే బంగారు భవిష్యత్



అరగిద్ద శివారులో పత్తి చేనులో పనిచేస్తున్న బాలిక తల్లిదండ్రులతో మాట్లాడుతున్న అధికారులు




వెంకట్రాంనగర్‌లో..

గట్టు: చదువుకుంటేనే మంచి భవిష్యత్ ఉంటుందని, తల్లిదండ్రులు పిల్లలను తప్పకుండా పాఠశాలకు పంపాలని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారిణి, గట్టు మండల స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ ప్రియాంక సూచించారు. కలెక్టర్ బీఎం సంతోష్ ఆదేశాల మేరకు బుధవారం అధికారులు అరగిద్దలో బడి మానేసి, పొలాల్లో పని చేస్తున్న పిల్లలను గుర్తించి, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. 14 ఏళ్లలోపు బాలబాలికలు తప్పనిసరిగా బడిలోనే ఉండాలని, వారి చేత పనులు చేయిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. బడి మానేసిన 15 మంది విద్యార్థులను గుర్తించి, తిరిగి బడిలో చేర్పించారు. 10వ తరగతి విద్యార్థులు పరీక్ష సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో జిల్లా నీతి ఆయోగ్ కోఆర్డినేటర్ అఫ్జల్, డీసీపీఓ నర్సింహ, ఎంఈఓ నల్లారెడ్డి, హెడ్మాస్టర్ జహీర్‌బేగ్, సీఆర్‌పీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను బడికి పంపండి

శాంతినగర్: బడి ఈడు పిల్లలందరినీ బడికి పంపాలని ప్రధానోపాధ్యాయుడు ఈశ్వరయ్య తల్లిదండ్రులను కోరారు. వడ్డేపల్లి మండలంలోని వెంకట్రామనగర్ ప్రభుత్వ పాఠశాలలో కేవలం ఏడుగురు విద్యార్థులు మాత్రమే బడికి వస్తున్నారు. దీంతో ఇటీవల పాఠశాలకు వచ్చిన ప్రధానోపాధ్యాయుడు ఈశ్వరయ్య ఇంటింటి వెళ్లి పిల్లలను బడికి పంపాలని తల్లిదండ్రులను కోరారు. చాలామంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు పంపుతున్నారని, కొందరు పిల్లలను పనులకు పంపిస్తున్నారన్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే విద్యార్థులు లేరని పాఠశాలను మూసి వేసే పరిస్థితి ఉంటుందని, ప్రభుత్వం అన్ని సౌకర్యాలతోపాటు, మధ్యాహ్న భోజనం, యూనిఫాం, పాఠ్యపుస్తకాలు అందజేస్తారని, పాఠశాలకు పిల్లలను పంపాలని సూచించారు. స్పందించిన కొందరు తల్లిదండ్రులు మధ్యలో పాఠశాల మార్చితే పిల్లలకు ఇబ్బంది అవుతుందని వచ్చే ఏడాది నుంచి ప్రభుత్వ బడికి పంపుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ దేవేంద్రుడు, ఎంవీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ హనిమిరెడ్డి, కమ్యూనిటీ మొబలైజర్ బడేసాబ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థను కాపాడటమే లక్ష్యం



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న సాహితీ కళావేదిక ప్రతినిధులు

వనపర్తిటౌన్: జిల్లాలో విద్యా వ్యవస్థను కాపాడటమే లక్ష్యంగా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ తరఫున చిత్తశుద్ధితో పనిచేస్తామని జీహెచ్‌ఎంఏ జిల్లా అధ్యక్షుడు ఎస్.చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి మద్దిలేటి అన్నారు. బుధవారం సాయంత్రం సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బాలభవన్‌లో నూతనంగా ఎన్నికైన జీహెచ్‌ఎంఏ కార్యవర్గం అభినందన సభలో వారు మాట్లాడుతూ.. విద్యార్థుల అభ్యున్నతి, విద్యా వ్యవస్థ పటిష్టం కావాలనే లక్ష్యంతోనే ప్రతి అడుగు ముందుకేస్తామని, స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రతి విద్యార్థి మీద రూ.వేలు ఖర్చు పెడుతుందని, ఆ ప్రజాధనాన్ని సద్వినియోగం చేయడంలో ప్రతి హెడ్మాస్టర్ అంకితభావంతో పని చేయాలని అభిప్రాయపడ్డారు. వ్యవస్థ బాగుకోసం కఠిన నిర్ణయాలు కొన్ని సందర్భాల్లో తప్పవని గుర్తుచేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్ మాట్లాడుతూ.. పాఠశాల నిర్వహణలో ప్రధానోపాధ్యాయులది పెద్దన్న పాత్ర అని చెప్పారు. సహచర ఉపాధ్యాయులను సమన్వయం చేసుకుంటూ పాఠశాల పరిరక్షణకు, విద్యార్థుల తల్లిదండ్రులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గణేష్‌కుమార్, శంకరయ్య, కురుమన్న, ఉమాదేవి, సరస్వతి, బైరోజు చంద్రశేఖర్, సాహితీ కళా వేదిక ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాల రూరల్: గద్వాల మండలంలోని వీరాపురం, బీరెల్లి, పూడురు సబ్ స్టేషన్ల పరిధిలో చెట్ల కొమ్మలను తొలగించడంతో పాటు వీరాపురం సబ్‌స్టేషన్ వద్ద కొత్తగా ఏబీ స్విచ్ ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ రూరల్ ఏఈ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు ఆయా సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తునున్నామని, వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

మత్తు పదార్థాలను అరికట్టాలి

గద్వాల అర్బన్: గ్రామాల్లో నిషేధిత మత్తు పదార్థాల సరఫరా, వినియోగంపై అధికారులు దృష్టి సారించి, చర్యలు తీసుకోవాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ కోరారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో మత్తు పదార్థాల వినియోగం, అసాంఘిక కార్యక్రమాలను అధికారుల దృష్టి తీసుకెళ్లి, ప్రజలకు వాటి వల్ల కలిగే నష్టాలపై వివరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. నడిగడ్డ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించే దిశగా ముందుకెళ్తామన్నారు. సమావేశంలో బుచ్చిబాబు, ప్రేమ్‌రాజ్, బలరాం, రంగస్వామి, వెంకట్రాములు, లక్ష్మన్న, అంజి తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ హామీలు అమలు చేయాలి

రాజోళి: ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో సీపీఎం రెండో మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీపీఎం ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటుందని, ఎన్నో సమస్యల పరిష్కారంలో సీపీఎం పాత్ర కీలకమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయలేదని ఆరోపించారు. ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలను గుర్తించి, వారికి ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వాలని కోరారు. అనంతరం పార్టీ సభ్యులు మండల కార్యదర్శిగా విజయ్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లక్ష్మన్న, బొజ్జన్న, కృష్ణ, నర్సింహులు, మంజునాథ పాల్గొన్నారు.

సీఐపై చర్య తీసుకోవాలి

గద్వాల క్రైం: గద్వాల ఇన్‌చార్జ్ సీఐ నాగేశ్వర్ రెడ్డిపై పోలీసుశాఖ చర్యలు తీసుకోవాలని బుధవారం ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కోళ్ల మహేష్ ఎస్పీ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగళవారం రాత్రి పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాల విద్యార్థి చికిత్స పొందుతూ మృతి చెందడంతో విద్యార్థి కుటుంబ సభ్యులు పాఠశాల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్నారు. వారికి మద్దతుగా అక్కడికి వెళ్లిన క్రమంలో సీఐ నాగేశ్వర్‌రెడ్డి జోక్యం చేసుకుని తనపై అకారణంగా లాఠీ, బూటు కాలితో దాడి చేశాడని ఆరోపించారు. ఈ క్రమంలో నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ విచక్షణ కోల్పోయి దాడి చేశారని మండిపడ్డారు. సీఐ తీరుపై విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ఎస్పీకి ఫిర్యాదు చేశామన్నారు. ఎస్పీని కలిసిన వారిలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ సంఘాల నాయకులు రాజు, కొంకల భీమన్న, అశోక్, రాజు తదితరులు ఉన్నారు.

మంత్రులకు స్వాగతం



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ సంతోష్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత

కేటీదొడ్డి: జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి భూములను సస్యశ్యామలం చేస్తామని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం సోమనాద్రి గట్టు ఎత్తిపోతల పథకం ప్రాజెక్టును పరిశీలించడానికి ఆయనతో పాటు రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక మంత్రి జూపల్లి కృష్ణరావు, ఎంపీ మల్లు రవి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి రాకతో స్థానిక ప్రజాప్రతినిధులు, హెలిప్యాడ్ వద్ద ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత, కలెక్టర్ సంతోష్, ఎస్పీ శ్రీనివాస్‌రావు, అధికారులు ఘనంగా స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు నర్సింగరావు, ఆర్డీఓ రామ్‌చందర్, తహసీల్దార్ సరితరాణి, వివిధ శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

'ప్రశస్త్'తో ఆరోగ్య సమస్యల గుర్తింపు



అవగాహన కల్పిస్తున్న అధికారులు

మానవపాడు: విద్యార్థుల్లో ఆరోగ్య సమస్యలు, వైకల్యాలను కనిపెట్టి వారికి సరైన వైద్య చికిత్స చేయించడాన్ని ఉపాధ్యాయులు బాధ్యతగా భావించాలని ఎంఈఓ శివప్రసాద్, ఉపాధ్యాయులు విష్ణువర్ధన్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని ప్రధానోపాధ్యాయులకు ప్రశస్త్ యాప్ కార్యక్రమం అమలుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్య సమస్యల గుర్తింపు కోసం ప్రశస్త్ కార్యక్రమాన్ని అమలు చేస్తుందన్నారు. ఇందులో 60 ప్రశ్నలకు సమాధానాలు నమోదు చేయడం ద్వారా వారిలోని రుగ్మతలను గుర్తించాలన్నారు.

'సులభ రీతిలో బోధన చేయాలి'



ధరూరు ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఎన్‌ఓ రవీంద్రబాబు

ధరూరు: ఉపాధ్యాయులు తాము నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన చేయాలని కాంప్లెక్స్ హెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి, ఎంఎన్‌ఓ రవీంద్రబాబు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులతో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు నిరంతరం విద్యార్థులుగా మారాలని సూచించారు. ఎఫ్‌ఏ2 ఎగ్జామ్ జరిగిన తరువాత తొందర మార్కుల లిస్టును సిద్ధం చేయాలన్నారు. సీజనల్ వ్యాధులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజన బిల్లులను ఎప్పటికప్పుడు చెల్లించాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల బ్యాంక్ ఖాతాలను తెరవని వారు ఉంటే వెంటనే ఓపెన్ చేయాలని ఆదేశించారు. విద్యార్థుల హాజరు తగ్గకుండా చూడాలన్నారు.

గ్యాస్ సబ్సిడీ పత్రాల పంపిణీ



పుల్లూరులో లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు



బీచుపల్లిలో..

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు పంచాయతీ కార్యాలయంలో బుధవారం లబ్ధిదారులకు గ్యాస్ సబ్సిడీ పత్రాలను ఎమ్మెల్యే విజయుడు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పథకాల ఎంపికలో లబ్ధి చేకూరకపోతే మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కలుగోట్ల పీఏసీఎస్ చైర్మన్ గజేందర్‌రెడ్డి, నాయకులు రఘురెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రవల్లి: మండలంలోని బీచుపల్లి, తిమ్మాపురం గ్రామాల్లో బుధవారం కాంగ్రెస్ నాయకులు మహాలక్ష్మి పథకం ద్వారా ఎంపికైన లబ్ధిదారులకు రూ.500 సబ్సిడీ గ్యాస్ సిలిండర్ ప్రొసీడింగ్ పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాజు, మహేంద్రచారి, నర్సింహులు, ఎల్లారెడ్డి, శేషన్న, ఆదాం తదితరులు ఉన్నారు.

పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు ఘన నివాళి



అయిజలో దీన్‌దయాళ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని జూలెకల్‌లో పండిత్ దీన్‌దయాళ్ జయంతిని పురస్కరించుకొని బుధవారం యువకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు వెంకటేష్‌యాదవ్, యువకులు పాల్గొన్నారు.

ఎర్రవల్లి: మండలంలోని వేములలో బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి మండల అధ్యక్షుడు జగదీష్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జనార్దన్‌రెడ్డి, మహేష్, శివ, పరశురామ్, వెంకట్, నాగరాజు, లక్ష్మణ్, శ్రీను, శ్యామ్ తదితరులు ఉన్నారు.

అయిజ: మండల కేంద్రంలో బీజేపీ నాయకులు దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, భీమసేనరావు, ప్రదీప్‌కుమార్, భగత్‌రెడ్డి, ఎల్లప్ప, ఉరుకుందు, నరేంద్ర, భీమేష్, వీరేష్, నరసింహ, చరణ్, సవారి, పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ విధానం రద్దు చేయాలి



వనపర్తి రూరల్: సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను విడుదల చేయాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు వరప్రసాదరావు అన్నారు. పెబ్బేరు మండలంలో పీఆర్‌టీయూ టీఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పాఠశాల ఉపాధ్యాయులకు సభ్యత్వం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంఘం ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ఎల్లవేళలా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, బౌద్ధారెడ్డి, సూర చంద్రశేఖర్, రవీందర్‌గౌడ్, శివశంకర్, మండల అధ్యక్షుడు దయానంద్, దుర్గాప్రసాద్, జయంత్‌రెడ్డి, దామోదర్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం ఏర్పాటు చేయాలి

శాంతినగర్: పట్టణంలో ఈనెల 26, 27, 30 తేదీల్లో మూడు రోజులపాటు వైద్య శిబిరం నిర్వహించాలని పీహెచ్‌సీ సిబ్బందికి మున్సిపల్ కమిషనర్ సూచించారు. కలెక్టర్, జెడ్పీ సీఈఓ, డీఎంహెచ్‌ఓ, డీపీఓ ఆదేశాల మేరకు మూడు రోజుల పాటు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్య క్యాంపు నిర్వహించాలన్నారు. గ్రామీణ, మున్సిపల్ మల్టీ లెవల్ వర్కర్లు, పంచాయతీ కార్యదర్శులు స్క్రీనింగ్ కోసం క్యాంపు ఏర్పాటు చేసి కార్మికులకు వైద్య పరీక్షలు అందించాలన్నారు.

బీచుపల్లిలో పూజలు

ఎర్రవల్లి: మండలంలోని బీచుపల్లి పుణ్యక్షేత్రాన్ని బుధవారం సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఇటీవలే ఆయన సోదరి కనకదుర్గ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా ఆమె అస్థికలకు పురోహితులు అనిల్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి చితాభస్మాన్ని కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. ఆయన వెంట కుటుంబ సభ్యులు, అర్చకులు, తదితరులు ఉన్నారు.